# ఆక్రమణలను పట్టించుకోరా..?!

- పాఠశాల ప్రహరీ ఆనుకుని రేకుల షెడ్‌లు
- దీంతో ఎక్కడి మురుగు నీరు అక్కడే నిల్వ
- దుర్వాసన వెదజల్లడంతో తగ్గిన విద్యార్థుల సంఖ్య
- పాఠశాల పక్కనే బెల్టుషాపు నిర్వహణ
- అధికారులు బెల్టు షాపులను అరికట్టాలని కోరుతున్న స్థానికులు


నిర్వాసిత కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

రాజుపాలెం: ఆక్రమణదారులకు ఎదురులేకుండా పోయింది. ఆక్రమణదారులు బడులు, గుడులు, బజారు స్థలాలు ఎక్కడపడితే అక్కడ ఆక్రమించుకుని అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారు. సైడు కాలువలపైన అక్రమంగా రేకుల షెడ్‌లు వేయడం వలన ఎక్కడి మురుగు నీరు అక్కడే నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతుంది. ఆక్రమణదారులకు ఎవరైనా అడ్డు చెబితే వారి పైనే తిరగబడుతున్నారు. పాఠశాల ప్రహరీ పక్కనే బెల్టు షాపు నిర్వహిస్తున్నారని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇది మండల కేంద్రమైన రాజుపాలెం పరిధిలోని పులిచింతల నిర్వాసిత కేంద్రంలోని ఆక్రమణదారుల నిర్వాకం.

## ఇది కేంద్రం స్వరూపం

మండల కేంద్రంలోని రాజుపాలెం పరిధిలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి నిర్వాసితులను, భావి తరాలను దృష్టిలో పెట్టుకుని అన్ని సౌకర్యాలతో పులిచింతల నిర్వాసిత కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో 1,367 మంది లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించారు. అప్పటి నుంచి ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. కేంద్రం మధ్యలో 60 అడుగుల వెడల్పుతో మిగిలినవి 40 అడుగుల వెడల్పు బజారులు ఏర్పాటు చేశారు. 60 అడుగుల


పాఠశాలకు ఆనుకుని మద్యం బెల్టు షాపు నిర్వహిస్తున్న షెడ్‌లు

వెడల్పు బజారు మధ్యలో ఉండడం వలన మండల పరిషత్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, భవిత కేంద్రం ఏర్పాటు చేసి చుట్టూ ప్రహరీ నిర్మించి గేటు ఏర్పాటు చేశారు. 60 అడుగుల బజారుకు మధ్యలో 15 అడుగుల సీసీ రోడ్డు వేశారు. సీసీ రోడ్డుకు ఇరు వైపులా 20 అడుగులు, 25 అడుగుల ఖాళీ స్థలం మిగిలి ఉంది.

## తగ్గిన విద్యార్థుల సంఖ్య

పాఠశాల గేటుకు ఇరువైపులా ప్రహరీకి ఆనుకుని ఆక్రమణదారులు రేకుల షెడ్‌లు వేసుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారు. గేటుకు ఇరు వైపులా గేదెలను కట్టేస్తున్నారు. రేకుల షెడ్‌ల వలన సైడు కాలువలో మురుగు నీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతుంది. దీని వలన విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. గతంలో 125 మంది ఉంటే ఈ ఏడాది 65 మంది మాత్రమే ఉన్నారు. 40 అడుగుల బజారులలోనూ సీసీ రోడ్డు పోను మిగిలిన స్థలంలో అక్రమంగా రేకుల షెడ్‌లను నిర్మిస్తున్నారు. దీంతో రహదారులు కుంచించుకుపోతున్నాయని, వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని నిర్వాసితులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ఆక్రమణలను నిరోధించాలని కోరుతున్నారు.

### పాఠశాల పక్కనే బెల్టు షాపు

పాఠశాల ప్రహరీకి ఆనుకుని ఆక్రమణదారుడు రేకుల షెడ్ వేసుకుని బెల్టు షాపు నిర్వహిస్తున్నాడు. ఇక్కడ తాగుబోతులు వీరంగం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అక్రమంగా షెడ్‌లు వేసి బెల్టు షాపులు నిర్వహిస్తున్నారని ఎక్సైజ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని నిర్వాసితులు వాపోతున్నారు. స్థానిక పోలీసు సిబ్బంది కూడా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బజారులలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలని తొలగించాలని నిర్వాసితులు కోరుతున్నారు.

### అధికారుల దృష్టికి తీసుకెళతా

నేను బదిలీపై కొత్తగా జాయిన్ అయ్యాను. బజారులు ఆక్రమించి అక్రమ కట్టడాలు కట్టడం నేరం, తప్పు. నిర్వాసితుల కేంద్రాన్ని పరిశీలించి బజారులలో అక్రమ కట్టడాలు ఉంటే ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లి వారి సలహా మేరకు నిర్ణయం తీసుకుంటాను.

– హర్షప్రియదర్శిని, పంచాయతీ కార్యదర్శి, రాజుపాలెం

## క్లుప్తంగా

### ఉపాధ్యాయులకు సత్కారం



అమరావతి: మండల పరిధిలోని మల్లాదిలో సుదీర్ఘకాలం పనిచేసి బదిలీపై వెళుతున్న ప్రధానోపాధ్యాయుడు రమేష్, ఉపాధ్యాయుడు సుబ్బారావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ తిలోకొరెడ్డిలు మల్లాది గ్రామ ప్రజలకు అందించిన సేవలను గుర్తించి వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం సన్మానించారు. బదిలీపై వెళుతున్న వీరిని క్రోసూరు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ వెంపా జ్వాలాలక్ష్మీనరసింహారావు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావుతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు వెంపా వాసు, వెంపా శ్రీను, రామారావు తదితరులు సత్కరించి వారి సేవలను కొనియాడారు.

### ఉచిత వైద్య శిబిరంలో 340 మందికి పరీక్షలు

సత్తెనపల్లి: మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్నారై మాగులూరి భానుప్రకాష్ సహకారంతో సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కాటూరి వారిచే ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో 340 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ముందుగా శిబిరాన్ని డీఎస్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ దరువూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోమటినేని శ్రీనివాసరావు, మక్కపాటి రామచంద్రరావు, లక్ష్మీనారాయణ, ఫౌండేషన్ నిర్వాహకులు మాగులూరి కృష్ణారావు, కుంచనపల్లి కిరణ్, కొండవీటి ప్రసాద్, ఏపూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



క్రోసూరు: మండలంలోని అనంతవరం శివారులో రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ పి.రవిబాబు తెలిపిన వివరాల మేరకు మండలంలోని దొడ్లేరు గ్రామానికి చెందిన దండుబుడే(36) క్రోసూరులోని ఓ రెస్టారెంట్‌లో వంట మాస్టర్‌గా పని చేస్తుంటాడు. ఈ క్రమంలో రాత్రి రెస్టారెంట్‌లో పని ముగించుకుని ఇంటికి వెళ్తుండగా అనంతవరం దాటిన తరువాత రోడ్డుపై బర్రెలు అడ్డురావటంతో బలంగా ఢీ కొనడంతో రోడ్డుపై పడిపోయాడు. తలకు, మొహానికి తీవ్ర గాయాలై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతుడి భార్య నాగుల్‌బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించామని తెలిపారు. మృతునికి ఒక కుమార్తె, కుమారుడు కలరు.

### విత్తన ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి

ఏవో ఎస్.శ్రీధర్‌రెడ్డి

ముప్పాళ్ళ: వ్యవసాయ సీజన్ ఆరంభం కావటంతో రైతులు సాగుకు కావాల్సిన విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటిస్తేనే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి ఎస్.శ్రీధర్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. నాణ్యమైన విత్తనాలనే ఎంపిక చేసుకొని కొనుగోలు చేయాలన్నారు. ప్రభుత్వం సర్టిఫై చేసిన విత్తనాలను మాత్రమే అధీకృత డీలర్ల వద్దే కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు అనంతరం రశీదు తప్పనిసరిగా తీసుకొని భద్రపరచుకోవాలన్నారు. విత్తన మొలక శాతం పరీక్షించుకున్న తర్వాతే సాగుకు శ్రీకారం చుట్టాలన్నారు. దుకాణదారులు కూడా రైతులకు బిల్లులు అందించాలని సూచించారు. రైతులు విత్తనాల ఎంపికతో పాటు యాజమాన్య పద్ధతులపై అవగాహన పెంచుకొని సాగు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది సలహాలు, సూచనలు పాటిస్తే మేలని చెప్పారు.

### త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాల పంపిణీ

అచ్చంపేట: దేవుడే అవతరించి ఒక మనిషిగా జన్మిస్తే ఆయనను భగవంతుడు అని అంటారని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక పిడుగురాళ్ల, చిలకలూరిపేట కమిటీల అధ్యక్షులు కటకం సైదారావు, యద్దనపూడి వీరాంజనేయులు అన్నారు. మండలంలోని పెదపాలెం, పులిచింతల ఆర్ అండ్ ఆర్ సెంటర్‌లలో భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేవుడే అవతరించి ఒక మనిషిగా జన్మించినవాడే శ్రీకృష్ణభగవానుడు అని అన్నారు. కార్యక్రమంలో జ్ఞానవేదిక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


బట్లూరులో నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యుడు

సత్తెనపల్లి: గ్రామీణ ప్రాంతాలలో పేద ప్రజలకు సేవ చేయడంలో హెల్ప్ ఫౌండేషన్ ఎప్పుడు ముందు ఉంటుందని, ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బట్లూరు సర్పంచ్ ఈదర రామారావు అన్నారు. మండలంలోని బట్లూరు గ్రామంలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీ ప్రథమ చికిత్స కేంద్రం సహకారంతో తెనాలికి చెందిన నేత్రాలయ ఐ కేర్, సత్తెనపల్లికి చెందిన శ్రీ సాయికృష్ణ డెంటల్ కేర్ వారిచే ఉచిత కంటి, దంత వైద్య శిబిరాలు ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ కంటి, దంత సమస్యలకు వైద్యులు చెప్పే సలహాలు, సూచనలు పాటించి మెరుగైన ఆరోగ్యాన్ని కలిగి ఉండాలన్నారు. శ్రీ సాయికృష్ణ డెంటల్ కేర్ హాస్పిటల్ వైద్యులు శివరామకృష్ణ మాట్లాడుతూ నోటి పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యం సిద్ధిస్తుందని అన్నారు. నోటి దుర్వాసన, దంతాల నుంచి చీము కారటం లాంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదన్నారు. నేత్రాలయ ఐ కేర్ వైద్యులు వినీల మాట్లాడుతూ కంటి సంరక్షణ చాలా ప్రాముఖ్యమైనదని, కంటి సమస్యలను నిర్లక్ష్యం చేస్తే కంటి చూపు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. శిబిరంలో 140 మందికి కంటి పరీక్షలు, 80 మందికి దంత పరీక్షలు చేశారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మీ ప్రథమ చికిత్స కేంద్రం నిర్వాహకులు సిద్దార్థ, సుభాని, హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, సభ్యులు శ్రీలత, చందు, భవాని, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## శక్తి యాప్‌పై కేజీబీవీ విద్యార్థినులకు అవగాహన



క్రోసూరు: అతివల రక్షణ, భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఎస్ఐ పి.రవిబాబు అన్నారు. కేజీబీవీ విద్యార్థినులకు శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎస్ఐ పాల్గొని మాట్లాడారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే మహిళల్ని గౌరవించి, వారి సమస్య తెలుసుకునేందుకు మహిళా కానిస్టేబుళ్లు, హోంగార్డులతో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. శక్తి యాప్‌ను సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని ఆపదలో ఉన్నప్పుడు సమాచారమిస్తే 10 నిమిషాలలో పోలీసుల సహాయం అందుతుందన్నారు. డ్వాక్రా, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, అన్ని వర్గాల మహిళలకు శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సైబర్ నేరాలపై పాఠశాలలు, కళాశాలల్లో చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## శాకంబరిగా అచ్చమ్మ పేరంటాళమ్మతల్లి



అచ్చంపేట: స్థానిక గ్రామ దేవత అచ్చమ్మ పేరంటాళమ్మ తల్లిని ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం శాకంబరిగా అలంకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు సూరే సుబ్బారావు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించారు. అమ్మవారికి పొంగళ్లు పొంగించి నైవేద్యం పెట్టారు. పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

## నేడు ఉచిత వైద్య శిబిరం

పిడుగురాళ్ల: పట్టణంలోని అంజిరెడ్డి హాస్పిటల్‌లో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆదివారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 వరకు నిర్వహించనున్న శిబిరంలో రూ.10 వేలు విలువ చేసే రక్త పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు చెప్పారు. ఉచితంగా మందులను కూడా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## కాలువ మరమ్మతు పనుల పరిశీలన



బెల్లంకొండ: నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా కాలువల నుంచి చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించడమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు ఎర్రబాలెం మేజర్ కాలువ చైర్మన్ మాచర్ల ముస్తఫా తెలిపారు. ఆదివారం మండలంలోని ఎర్రబాలెం మేజర్ కాలువకు మరమ్మతు పనులను స్థానిక అధికారులు, నాయకులతో కలిసి పరిశీలించారు. మేజర్ కాలువకు గండ్లు పడి, పూడిక ఏర్పడి నీటి ప్రవాహానికి అంతరాయాలు కలుగుతుంటడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆదేశాల మేరకు మేజర్ కాలువకు మరమ్మతులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఎన్‌ఎస్పీ ఏఈ ఇబ్రహీం, టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, నాయకులు పాల్గొన్నారు.

### రాయితీపై వరి విత్తనాలు పంపిణీ

నకరికల్లు: రాయితీపై వరి విత్తనాలను మండలంలోని గుండ్లపల్లిలో సోమవారం పంపిణీ చేయనున్నట్లు ఏవో కె.దేవదాసు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక కేజీ వరి విత్తనాలు రూ.43 కాగా రాయితీపై రూ.38కు ఇవ్వనున్నట్లు తెలిపారు. కేఎన్‌ఎం–1638 50 క్వింటాళ్లు, బీపీటీ–5204 10 క్వింటాళ్లు పంపిణీ చేస్తామన్నారు. కావలసిన రైతులు సంబంధిత పత్రాలతో రైతు సేవ కేంద్రంలో సంప్రదించాలన్నారు.

## రాజకీయ కక్షలో భాగంగానే మిథున్ రెడ్డి అరెస్ట్

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి



బెల్లంకొండ: కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షలో భాగంగానే వైఎస్సార్‌సీపీ రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని అరెస్టు చేసినట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలనకు మిథున్‌రెడ్డి అరెస్ట్ నిదర్శనమని తెలిపారు. కేసులతో అరెస్టులతో వైఎస్సార్‌సీపీని నిలువరించాలనే ప్రయత్నంలో కూటమి ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష నేత అడుగు బయటకు పెడితే కేసులు పెడుతున్నారని, కేసులతో జగన్‌ను భయపెట్టలేరని తెలిపారు. జగన్‌మోహన్ రెడ్డికి ప్రజాబలం ఉందని, ఆయన పర్యటనలో వస్తున్న ప్రజాదరణ చూడలేక కూటమి ప్రభుత్వం కేసులు పెడుతోందని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేక, తప్పుడు కేసులతో ప్రజల దృష్టిని మరల్చేందుకు పార్టీ ముఖ్య నాయకులను అరెస్టు చేస్తున్నారని అన్నారు. అన్యాయంపై న్యాయం ఎప్పటికైనా గెలుస్తుందని, మచ్చలేని నేతగా మిథున్ రెడ్డి బయటకు వస్తారని ఆయన పేర్కొన్నారు.

## కన్నా రంగయ్య ట్రస్ట్ సేవలు స్ఫూర్తిదాయకం

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ


ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: కన్నా రంగయ్య ట్రస్ట్ సేవలు స్ఫూర్తిదాయకమని, ఆ పేరుతో ఇస్తున్న ఉపకార వేతనాలు ప్రతిభావంతుల చదువుకు భరోసాతో పాటు వారి విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు దోహదం చేస్తాయని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని కాకతీయ కల్యాణ మండపంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమంలో ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను అందరూ ప్రోత్సహించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన చాలా మంది విద్యార్థులు శాస్త్రవేత్తలుగా దేశానికి, ప్రపంచానికి సేవలందిస్తున్నారన్నారు. కార్పొరేట్ పాఠశాలల్లో చదివిస్తేనే పిల్లలకు చదువు వస్తుందని తల్లిదండ్రులు భావించడం సరికాదన్నారు. 2013 నుంచి కన్నా రంగయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రతిభావంతులైన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఆసుపత్రులకు అవసరమైన మౌలిక వసతులు, నిరుపేదల అభ్యున్నతికి ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో చారిటబుల్ ట్రస్ట్ సేవల్ని విస్తృతం చేస్తామన్నారు. గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు, సత్తెనపల్లి ఆర్డీవో జీవీ రమణాకాంత్ రెడ్డి మాట్లాడారు. అనంతరం 84 మంది విద్యార్థులకు రూ.11.15 లక్షలు ఉపకార వేతనాలు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ దరువూరి నాగేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, మక్కపాటి రామచంద్రరావు, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## పెద్దింటమ్మ తల్లికి ఆషాఢ బోనాల సమర్పణ


బోనాలు తీసుకువెళుతున్న గ్రామస్తులు

అమరావతి: పంచారామ క్షేత్రాలలో ప్రథమారామ క్షేత్రమైన అమరావతిలో గ్రామ దేవత పెద్దింటమ్మ తల్లికి ఆషాఢ మాసం బోనాలు సమర్పించే కార్యక్రమాన్ని ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆదివారం ఉదయాన్నే పెద్దింటమ్మ అమ్మవారికి పంచామృత అభిషేకం, అనంతరం వివిధ రకాల కూరగాయలతో శాకాంబరిదేవి అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలోని భక్తులు పొంగళ్లు చేసుకుని మేళతాళాలతో ఊరేగింపుగా పెద్దింటమ్మ గుడికి చేరుకుని అమ్మవారికి ఆషాఢ మాస బోనాలు సమర్పించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పెద్దింటమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

# పేదలకు అండ సీపీఐ జెండా

సీపీఐ నియోజకవర్గ మహాసభలో రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు


సీపీఐ జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

అమరావతి: పేదలకు అండగా ఉంటూ వారి సమస్యలపై నిరంతరం పోరాడే పార్టీ సీపీఐ మాత్రమేనని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ క్వార్టర్స్ ఆవరణలో పెదకూరపాడు నియోజకవర్గ సీపీఐ 16వ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ మహాసభకు నియోజవర్గ కార్యదర్శి మునుగోడు శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ పుట్టుక, దాని ప్రాధాన్యత, విశిష్టత, బాధ్యతల గురించి వివరించారు. స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర కీలకమని ప్రపంచంలోనే గొప్ప ఆదరణ పొందిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. గ్రామాలలో పార్టీని బలోపేతం చేయాలన్నారు. అమరావతి రాజధాని కోసం సీపీఐ అనేక పోరాటాలు చేసిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి రాజధానిని అభివృద్ధి చేసిన తర్వాత రెండో విడత భూ సమీకరణకు వెళ్లాలన్నారు. పెట్టుబడిదారులు ప్రజా ప్రతినిధులుగా ఎన్నిక కావడంతో ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోవటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో మతోన్మాద దాడులు పెరిగాయన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని పక్కన బెట్టి కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తొలుత నాయకులు, కార్యకర్తలు సీపీఐ జెండా ఆవిష్కరించారు. ఈ సభలో సీపీఐ పెదకూరపాడు నియోజవర్గ నూతన కౌన్సిల్ సభ్యులుగా 41 మందితో కమిటీ సభ్యులుగా 11 మందిని ఎంపికకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. అనంతరం పార్టీ అభివృద్ధికి తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి మారుతి వరప్రసాద్, సహాయ కార్యదర్శులు రాంబాబు షేక్ హుస్సేన్, జిల్లా ప్రజా నాట్యమండలి కార్యదర్శి భైరపట్నం రామకృష్ణ తదితరులు ప్రసంగించారు. నియోజవర్గంలోని అన్ని మండలాల సీపీఐ అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్మార్ట్ మీటర్లు వద్దు.. పాత మీటర్లే కావాలి


బాబురావు ఎదుట ఆవేదన చెందుతున్న పిండిమర యజమాని సీతారామయ్య

సత్తెనపల్లి: స్మార్ట్ విద్యుత్ మీటర్లు వద్దని, పాత మీటర్లే కావాలని సత్తెనపల్లికి చెందిన పిండిమర వ్యాపారి కె.సీతారామస్వామి వాపోయాడు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబురావు శనివారం సత్తెనపల్లి పర్యటనలో భాగంగా ఓ పిండిమరను సందర్శించి విద్యుత్ బిల్లుల సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా పిండిమర వ్యాపారి సీతారామస్వామి బాబురావు ఎదుట తన గోడు చెప్పుకుంటూ.. నా షాపులో స్మార్ట్ మీటర్ బిగించినప్పటి నుంచి కరెంట్ బిల్లు అనేక రెట్లు వస్తుందని, షాపులో రెండు మోటార్లు, లైటు, ఫ్యాను ఉంటుందని గతంలో కరెంట్ బిల్లు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు వచ్చేదని, ఇప్పుడు స్మార్ట్ మీటర్ బిగించినప్పటి నుంచి మొదటి నెల రూ.9 వేలు, తరువాత రూ.24,360 బిల్లు వచ్చిందని అన్నారు. కరెంటు అధికారులను అడగగా వారు బిల్లును పరిశీలించి.. అది మాకు తెలియదు ఎంత బిల్లు వస్తే అంత బిల్లు కట్టాల్సిందేనని తేల్చి చెప్పారన్నారు. మీటరులో ఏమైనా లోపాలు ఉన్నాయేమో మార్చమని కోరగా ఆ మీటరు అదానీ కంపెనీ వారు బిగించినదని వారే దాని గురించి చూడాలని చెప్పారని వాపోయారు. మా ఆదాయమే రోజుకు రూ.వెయ్యి ఉంటుందని ఇంత కరెంటు బిల్లు ఎలా కట్టగలమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ మనం ఎన్నుకున్న ప్రభుత్వాలు అదానీ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుని స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని, ఆదాయం మొత్తం కార్పొరేట్‌లకు దోచిపెడుతున్నారని అన్నారు. ఈ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీపీఎం ఉద్యమాన్ని చేపడుతుందని ఆ ఉద్యమంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఆయనతో పాటు సీపీఎం నాయకులు కట్టా శివదుర్గా రావు, న్యాయవాది పిన్నమనేని పాములయ్య తదితరులు ఉన్నారు.

# మోకాళ్లపై మున్సిపల్ కార్మికుల నిరసన


మోకాళ్లపై నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

సత్తెనపల్లి: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సత్తెనపల్లి మున్సిపల్ కార్మికులు వినూత్న రీతిలో మోకాళ్లపై నిరసన ఆదివారం చేపట్టారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి సీఐటీయూ పట్టణ కన్వీనర్ జె.రాజ్ కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, మట్టి ఖర్చులకు రూ.20 వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ 62 సంవత్సరాలకు పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. చనిపోయిన కార్మికుల స్థానాలలో వారి పిల్లలకి ఉద్యోగం ఇవ్వాలని, తదితర డిమాండ్లతో సమ్మెలో దిగడం జరిగిందన్నారు. మోకాళ్లపై నిలబడి నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ సెక్షన్, పారిశుద్ధ్య కార్మికులు సీహెచ్ వెంకయ్య, చంద్రకళ, జల్లి రమేష్, కార్మికులు సీహెచ్ సునీత, దుర్గ, మిల్క్ కుమారస్వామి, జానీ, థామస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన రహదారి జలమయం


ముప్పాళ్లలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు

ముప్పాళ్ళ : చిన్నపాటి వర్షం కురిస్తే చాలు రోడ్లన్నీ జలమయంగా మారిపోతున్నాయి. నరసరావుపేట–సత్తెనపల్లి ప్రధానరహదారిపై ముప్పాళ్లలో ఆదివారం కురిసిన వర్షానికి రోడ్డంతా జలమయంగా మారింది. రహదారికి ఇరువైపులా సైడ్ డ్రైన్‌లు లేకపోవటంతోపాటు, రహదారిపై ఆక్రమణలు, అక్కడక్కడా ఉన్న కాలువలు కూడా మురుగుతో నిండిపోవటంతో చిన్నపాటి వర్షం కురిసినా నీరంతా రోడ్డు పైకి చేరి రాకపోకలకు ఇబ్బందికరంగా తయారైంది. పాదచారులు రోడ్డుపై నడవటానికి నానా పాట్లు పడాల్సివచ్చింది.